నిరసన వీడని విపక్షాలు

అదానీ, సంభల్ ఘటనలపై చర్చకు పట్టు.. శుక్రవారానికి పార్లమెంట్ వాయిదా

న్యూఢిల్లీ, నవంబర్ 28: భారత పారిశ్రామిక వేత్త అదానీ అవినీతి అంశం, యూపీలోని సంభల్‌లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై విపక్షాలు నిలదీస్తూ నిరసనలు వ్యక్తం చేయడంలో గురువారం పార్లమెంట్ ఉభయ సభలు స్తంభించిపోయాయి. దీంతో లోక్‌సభ, రాజ్యసభ శుక్రవారానికి వాయిదా పడ్డాయి. సంభల్‌లో మసీదు సర్వే సందర్భంగా హింసకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు సభాపతి స్థానం వద్దకు వచ్చి నినాదాలు చేశారు. సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్న కాంగ్రెస్, దాని మిత్రపక్షాల చర్యలను పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. కొన్ని అంశాలపై సభలో చర్చించడానికి, వక్ఫ్ సవరణ బిల్లుపై వేసిన జాయింట్ కమిటీ గడువును పొడిగించడానికి తాము అంగీకరించినా విపక్షాలు నిరసనలు తెలుపుతున్నాయని ఆయన ఆరోపించారు. విపక్షాలు తమ నిరసనలు కొనసాగించడంతో సభాపతి స్థానంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ఎంపీ కృష్ణప్రసాద్ సభను వాయిదా వేశారు. అంతకుముందు వక్ఫ్ సవరణ బిల్లుపై వేసిన జాయింట్ కమిటీని వచ్చే ఏడాది బడ్జెట్ సమావేశం వరకు పొడిగిస్తూ లోక్‌సభలో తీర్మానాన్ని ఆమోదించారు. ప్రశ్నోత్తరాల సమయం కూడా విపక్ష సభ్యుల గందరగోళం మధ్య కొనసాగింది.

ప్రియాంక గాంధీ ప్రమాణ స్వీకారం

కేరళలోని వయనాడ్ ఉప ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ గురువారం లోక్‌సభలో ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆమె సోదరుడు, ఎంపీ రాహుల్ గాంధీ, ఇతర నేతలు వెంట రాగా తొలిసారిగా సభలో అడుగుపెట్టారు. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ ఓం బిర్లా కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. నాందేడ్ ఎంపీగా నెగ్గిన కాంగ్రెస్ నేత రవీంద్ర వసంతరావ్ చవాన్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రియాంక గాంధీ ఎంపీగా ఎన్నికవ్వడంతో ఒక తల్లి, ఆమె ఇద్దరు బిడ్డలు ఒకేసారి ఎంపీలుగా ఉన్న అరుదైన ఘటన పార్లమెంట్‌లో చోటు చేసుకుంది.

కింది స్థాయి కోర్టుల్లో

4.53 కోట్ల పెండింగ్ కేసులు

గత 11 నెలల కాలంలో జిల్లా, సబార్డినేట్ న్యాయస్థానాల్లో 9 లక్షలకు పైగా పెండింగ్ కేసులు ఉన్నట్టు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ గురువారం రాజ్యసభలో తెలిపారు. అలాగే ఈ ఏడాది జనవరి 1 నాటికి మొత్తం 4.44 కోట్ల కేసులు ఉన్నాయని, నవంబర్ 15తో కలుపుకుని మొత్తం 4.53 కోట్ల కేసులున్నట్టు మంత్రి వివరించారు. సబార్డినేట్, జిల్లా కోర్టుల్లో 5 వేలకు పైగా జడ్జీ పోస్టులు, దేశంలోని 25 హైకోర్టుల్లో మొత్తం 360 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఇక సుప్రీం కోర్టులో మొత్తం 34 జడ్జీలకు ప్రస్తుతం 32 మంది ఉన్నారని ఆయన తెలిపారు.

1.12 కోట్ల ప్రజా ఫిర్యాదుల పరిష్కారం

గత ఐదేండ్ల కాలంలో 1.12 కోట్ల ప్రజా ఫిర్యాదులను పరిష్కరించినట్టు కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన పీజీపోర్టల్.జీవోవీ.ఇన్‌లో 2020-2024 సంవత్సరాల మధ్య 1,12,30,957 ఫిర్యాదులను పరిష్కరించామని, ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు రికార్డు స్థాయిలో అధికంగా 23,24,323 పరిష్కరించినట్టు వివరించారు.

అంగన్వాడీ బాలల్లో ఎదుగుదల సమస్య

అంగన్వాడీల్లో నమోదైన ఐదేండ్ల లోపు వయసు గల బాలలు ఎదుగుదల సమస్యను ఎదుర్కొంటున్నారు. కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ తెలిపిన వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా అంగన్వాడీల్లో 7.54 కోట్ల మంది ఐదేళ్ల లోపు వయసుగల బాలలు ఉన్నారు. వీరిలో 38.9 శాతం మంది వయసుకు తగిన ఎత్తు ఎదగలేదు. 17 శాతం మంది తక్కువ బరువు, 5.2 శాతం మంది ఎత్తుకు తగిన బరువు లేరు. పోషకాహార లోపం వల్ల ఈ సమస్యలు తలెత్తుతాయి.

గురువారం లోక్‌సభలో అదానీ అవినీతి, సంభల్‌లో హింస అంశాలపై చర్చించాలని నిరసనకు దిగిన విపక్షాలు

24 ఏండ్లలో రూ.1.44 లక్షల కోట్ల టోల్ ట్యాక్స్ వసూలు

ఆటంక రహిత ప్రయాణానికి ఈటీసీ అమలు

న్యూఢిల్లీ, నవంబర్ 28: జాతీయ రహదారులపై పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం(పీపీపీ) విధానంలో నిర్వహిస్తున్న ప్లాజాల ద్వారా 2000 డిసెంబర్ నుంచి ప్రభుత్వం రూ.1.44 లక్షల కోట్లు టోల్ ట్యాక్స్‌గా వసూలు చేసినట్టు మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. ప్రస్తుతం అమలవుతున్న ఫాస్ట్‌టాగ్‌కు అదనంగా, ఎలాంటి ఆటంకం లేకుండా ముందుకు సాగేందుకు వీలుగా ఎలక్ట్రానిక్ టెక్నాలజీ కలెక్షన్ (ఈటీసీ) సాంకేతికత అమలును ప్రారంభించినట్టు చెప్పారు. గ్లోబల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (జీఎన్ఎస్ఎస్) ఆధారిత విధానం ప్రస్తుతం ఏ జాతీయ రహదారులపై అమలు చేయడం లేదని ఆయన తెలిపారు. ఆ విధానంలో అప్పటివరకు ఆ వాహనం జాతీయ రహదారి లేదా ఎక్స్‌ప్రెస్ వేలపై ప్రయాణించిన వాస్తవ దూరాన్ని ఆధారంగా రుసుము వసూలు చేసేవారని, కానీ ప్రస్తుత విధానం ప్రకారం ప్లాజా ప్రాజెక్టు పొడవును ఆధారంగా ఫీజు వసూలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఖండాంతర క్షిపణిని పరీక్షించిన భారత్

3,500 కి.మీ లక్ష్యాన్ని ఛేదించే సత్తా

విశాఖపట్నం: జలాంతర్గామి నుంచి ప్రయోగించే అణ్వాయుధ సామర్థ్యం గల ఖండాంతర క్షిపణిని భారత్ పరీక్షించింది. ఇది 3,500 కి.మీ. పరిధిలోని లక్ష్యాన్ని ఛేదించగలదు. అణ్వాయుధ సామర్థ్యం గల జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్ నుంచి దీనిని విశాఖపట్నం నుంచి ప్రయోగించి, పరీక్షించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ క్షిపణి విజయవంతంగా లక్ష్యాన్ని ఛేదించిందా? లేదా? అనే విషయం త్వరలోనే తేలనుంది. ఐఎన్ఎస్ అరిఘాత్‌ను భారత నావికా దళంలో ఆగస్టులోనే ప్రవేశపెట్టారు. దీని నుంచి కె-4 క్షిపణిని పరీక్షించడం ఇదే మొదటిసారి. కె-4 క్షిపణిని అనేక సంవత్సరాలుగా సబ్ మెర్సిబుల్ పంటూన్స్ నుంచే పరీక్షిస్తున్నారు. కె-4 క్షిపణిని డీఆర్‌డీఓ అభివృద్ధి చేసింది.

ప్రధాని హత్యకు బెదిరింపు కాల్

ముంబై: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని హత్య చేస్తానంటూ ఫోన్ చేసి బెదిరించిన మహిళ (34)ను ముంబై పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. తన వద్ద ఓ తుపాకీ ఉందని, మోదీపై దాడికి సిద్ధంగా ఉన్నానని ఆమె బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. ముంబై పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఈ ఫోన్ కాల్ వచ్చిందన్నారు. ఆ మహిళ మానసిక పరిస్థితి నిలకడగా లేనట్లు తెలుస్తున్నదని, అయినా ఆమె చేసిన బెదిరింపులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తామని చెప్పారు. ప్రముఖ నేతలను హత్య చేస్తామని ఇటీవల బెదిరింపు ఫోన్ కాల్స్ రావడం పెరుగుతున్నది.

ఢిల్లీలో బాంబు పేలుడు

గత నెలలో అదే చోట భారీ పేలుడు

న్యూఢిల్లీ, నవంబర్ 28: ఢిల్లీ ప్రశాంత్ విహార్‌లోని పీవీఆర్ మల్టీ ప్లెక్స్‌కు సమీపంలో గురువారం ఉదయం స్వల్ప తీవ్రత గల బాంబు పేలింది. దీంతో స్థానికులు, మల్టీప్లెక్స్‌కు వచ్చిన ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పీవీఆర్ మల్టీప్లెక్స్‌కు కొద్ది మీటర్ల దూరంలోనే జరిగిన పేలుడులో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. ఘటనా స్థలం నుంచి తెల్లటి పౌడర్ లభ్యమైందని, మరిన్ని వివరాల కోసం దర్యాప్తు చేపట్టామని పోలీస్ అధికారి ఒకరు చెప్పారు. ప్రశాంత్ విహార్‌లోని ఇదే ప్రాంతంలో అక్టోబర్ 20న సీఆర్‌పీఎఫ్ స్కూల్ గోడను ఆనుకొని భారీ పేలుడు ఒకటి సంభవించింది. ఢిల్లీలో శాంతి భద్రతలను కాపాడటంలో కేంద్రం విఫలమైందని ఢిల్లీ సీఎం ఆతిశీ ఆరోపించారు.

రువాండాలో చిక్కిన లష్కరే ఉగ్రవాది

భారత్‌కు అప్పగింత

న్యూఢిల్లీ: పాక్ కేంద్రంగా ఉగ్ర కార్యకలాపాలకు పాల్పడుతున్న లష్కరే తోయిబా మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది సల్మాన్ రెహమాన్ ఖాన్ రువాండాలో పట్టుబడ్డాడు. ఇంటర్‌పోల్ సహకారంతో భారత దర్యాప్తు సంస్థలు అతడ్ని భారత్‌కు రప్పించగలిగాయి. రువాండా రాజధాని కిగాలిలో అతడిని అరెస్ట్ చేశారు. రువాండా ఇన్వెస్టిగేషన్ బ్యూరో, నేషనల్ సెంట్రల్ బ్యూరో అతడ్ని భారత్‌కు తరలించగా, గురువారం ఉదయం జాతీయ దర్యాప్తు ఏజెన్సీ(ఎన్ఐఏ) అదుపులోకి తీసుకుంది. బెంగళూరు జైల్లో ఉండగా అతడు పలు ఉగ్రవాద దాడులకు వ్యూహం పన్నాడని, ఆయుధాలు, మందుగుండు సమకూర్చాడని ఆరోపణలున్నాయి. నిందితుడు దేశం విడిచి పారిపోవటంతో, అతడిపై ఆగస్టు 2న రెడ్ నోటీస్ జారీ అయ్యింది.

16 ఏండ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా నిషేధం

చట్టం చేసిన ఆస్ట్రేలియా

కాన్‌బెర్రా: తమ దేశంలో 16 ఏండ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా వినియోగించకుండా ఆస్ట్రేలియా చట్టం చేసింది. ఈ చట్టాన్ని సెనేట్‌లో 19 మంది సభ్యులు బిల్లును వ్యతిరేకించగా 34 మంది ఆమోదించారు. ప్రతినిధుల సభలో 13 మంది మాత్రమే బిల్లును వ్యతిరేకించగా ఏకంగా 102 మంది ఆమోదం తెలిపారు. దీంతో పిల్లలకు సోషల్ మీడియాను నిషేధిస్తూ చట్టం చేసిన మొదటి దేశంగా ఆస్ట్రేలియా నిలిచింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో 16 ఏండ్ల లోపు పిల్లలకు అకౌంట్లు ఉండకుండా చూడటంలో విఫలమైతే ఆయా సోషల్ మీడియా సంస్థలకు 33 మిలియన్ అమెరికన్ డాలర్ల వరకు జరిమానా విధించేలా చట్టంలో పొందుపరిచారు.

రేప్ చేసి చంపి.. 50 ముక్కలుగా నరికి..

- **సహ జీవనం చేస్తున్న మహిళ పై దారుణం**
- **జార్ఖండ్‌లో ఘటన.. నిందితుడి అరెస్ట్**

రాంచీ, నవంబర్ 28: ఢిల్లీలోని శ్రద్ధా వాకర్ హత్య తరహాలో జార్ఖండ్‌లో మరో దారుణం చేటు చేసుకుంది. మాంసం అమ్మే వృత్తిలో ఉన్న ఒక యువకుడు తనతో సహ జీవనం చేస్తున్న మహిళని హత్య చేసి ముక్కలు ముక్కలుగా నరికాడు. అనంతరం వాటిని ఒక అటవీ ప్రాంతంలో పలు చోట్ల పారేశాడు. ఈ దారుణ సంఘటన జార్ఖండ్‌లో చోటు చేసుకుంది. తమిళనాడుకు చెందిన 26 ఏండ్ల నరేశ్ భెంగ్రా.. తన జిల్లాకే చెందిన 24 ఏండ్ల ఒక మహిళతో గత రెండేండ్లుగా సహ జీవనం చేస్తున్నాడు. కొద్దికాలం క్రితం వీరు జార్ఖండ్ లోని కుంతీకి వచ్చారు. అయితే ఆమెకు చెప్పకుండా నరేశ్ మరో మహిళను పెండ్లి చేసుకున్నాడు. తర్వాత ఆమె తనకు అడ్డుగా ఉంటుందని భావించాడే ఏమో.. ఈ నెల 8న జోర్దాగ్ గ్రామ సమీపంలోని అడవిలోకి ఆమెను తీసుకెళ్లి లైంగిక దాడి చేసి, హత్య చేసి శరీరాన్ని ముక్కలు ముక్కలుగా నరికాడు. సుమారు 40, 50 శరీర భాగాలను అడవిలో వివిధ ప్రదేశాలో పడేశాడు. అయితే మృతురాలి చేతిని ఒక కుక్క తింటుండగా చూసిన కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ నెల 24న ఈ దారుణం వెలుగు చూసింది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడు నేరాన్ని అంగీకరించాడు.

అంబులెన్స్‌లో బాలికపై లైంగిక దాడి

భోపాల్: పదహారేండ్ల బాలికను కిడ్నాప్ చేసిన ఇద్దరు వ్యక్తులు కదులుతున్న అంబులెన్స్‌లో ఆమెపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మధ్యప్రదేశ్‌లోని మౌగంజ్ జిల్లాలో జరిగిందీ ఘటన. ఈ నెల 25న ఈ ఘటన జరగ్గా తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇద్దరు వ్యక్తులు తనను కిడ్నాప్ చేసి జనని ఎక్స్‌ప్రెస్ అంబులెన్స్‌లో ఎక్కించారని, అందులో తనపై అఘాయిత్యానికి పాల్పడ్డారని బాధిత బాలిక పోలీసులకు తెలిపింది. ఈ ఘటనలో అంబులెన్స్ డ్రైవర్ వీరేంద్ర చతుర్వేది, అతడి స్నేహితుడు రాజేశ్ కేవాత్‌లను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. బాలికకు నిర్వహించిన వైద్య పరీక్షల్లో ఆమె లైంగికదాడికి గురైనట్టు నిర్ధారణ అయింది. కాగా, గత నెల 21న రేవా జిల్లాలో కొత్తగా పెళ్లయిన మహిళపై సామూహిక లైంగిక దాడి జరిగింది. భర్తతో కలిసి పిక్నిక్‌కు వెళ్లిన ఆమెను కిడ్నాప్ చేసిన దుండగులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. సంచలనం సృష్టించిన ఈ కేసులో మొత్తం 8 మందిని అరెస్ట్ చేశారు.

కెనడాలో భారత్ దౌత్యవేత్తలపై నిఘా

పార్లమెంటుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: కెనడాలోని భారత దౌత్యాధికారులపై ఆడియో, వీడియో నిఘా పెట్టినట్లు పార్లమెంటుకు కేంద్ర ప్రభుత్వం గురువారం చెప్పింది. విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ రాజ్యసభలో ఒక ప్రశ్నకు సమాధానం చెప్పూ, కెనడాలోని వాంకోవర్‌లో ఉన్న మన దేశ దౌత్యాధికారులపై ఆ దేశం ఆడియో, వీడియో నిఘా పెట్టిందని తెలిపారు. ఈ విషయాన్ని ఆ దేశ అధికారులు మన దేశ దౌత్యవేత్తలకు చెప్పారన్నారు. ప్రైవేట్ కమ్యూనికేషన్స్‌ను కూడా అడ్డుకుని, పరిశీలిస్తున్నట్లు తెలిపారన్నారు. దీంతో మన దేశంలోని కెనడా హై కమిషన్‌కు ఈ నెల 2న నిరసన తెలిపామని చెప్పారు. కెనడా చర్యలు అన్ని దౌత్య నిబంధనలను ఉల్లంఘించడమేనని తెలిపారు. కెనడాలోని మనదేశ దౌత్యవేత్తలు ఇప్పటికే తీవ్రవాదం, హింసాత్మక వాతావరణంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నారన్నారు. సాంకేతిక అంశాలను సాకుగా చూపించి ఈ వాస్తవాన్ని కెనడా సమర్థించుకోజాలదని పేర్కొన్నారు.

డిగ్రీ కోర్సు కాలాన్ని మార్చుకోవచ్చు

- **పెంచుకునే లేదా తగ్గించుకునేలా విద్యార్థులకే అవకాశం**
- **కొత్త విధానాన్ని తేనున్న యూజీసీ**

న్యూఢిల్లీ, నవంబర్ 28: డిగ్రీ పూర్తి చేయాలంటే ఇక మూడు, నాలుగేండ్లు ఆగాల్సిన పని లేదు. అభ్యాస సామర్థ్యాలను బట్టి కోర్సు కాలాన్ని పెంచుకునే లేదా తగ్గించుకునే అవకాశం విద్యార్థులకు ఉండనుంది. ఈ మేరకు యూజీసీ కొత్త విధానాన్ని అమలులోకి తీసుకురానున్నది. ఉన్నత విద్యా సంస్థలు యాక్సెలరేటెడ్ డిగ్రీ ప్రోగ్రామ్(ఏడీపీ), ఎక్స్‌టెండెడ్ డిగ్రీ ప్రోగ్రామ్(ఈడీపీ) కోర్సులు అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన నిబంధనలకు యూజీసీ ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ విధానం అమలులోకి వస్తే విద్యార్థులు మొదటి సెమిస్టర్ లేదా రెండో సెమిస్టర్ పూర్తయ్యే లోగా ఏడీపీ లేదా ఈడీపీ కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ దరఖాస్తులను ఆయా విద్యాసంస్థల్లోని కమిటీలు పరిశీలించి ఆమోదించడమో తిరస్కరించడమో చేస్తాయి. ఏడీపీ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ప్రతి సెమిస్టర్‌కు అదనపు క్రెడిట్లను పొందాల్సి ఉంటుంది. ఈడీపీ విద్యార్థులు తక్కువ క్రెడిట్లను పొందొచ్చు. వీరికి ఇచ్చే డిగ్రీలకు కూడా మిగతా డిగ్రీలతో సమానంగా విలువ ఉంటుంది.

మరాఠాల వ్యతిరేకతపై బీజేపీలో గుబులు

- **ఫడ్నవీస్‌ను సీఎం చేస్తే దూరమవుతారని భయం**
- **సీఎం ఎంపిక ప్రకటన ఆలస్యానికి కారణమిదే!**

ముంబై: మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా దేవేంద్ర ఫడ్నవీస్‌కు అవకాశం ఇవ్వాలని బీజేపీ అధిష్ఠానం భావిస్తున్నప్పటికీ అధికారిక ప్రకటనకు మాత్రం ఆచితూచి వ్యవహరిస్తున్నది. మరాఠాల్లో వ్యతిరేకత వస్తుందనే ఆందోళనతో ఇందుకు కారణమని తెలుస్తున్నది. మరాఠా అయిన ఏక్‌నాథ్ షిండేను సీఎం పదవి నుంచి తప్పించి బ్రాహ్మణుడైన ఫడ్నవీస్‌కు అవకాశం ఇవ్వడం వల్ల మరాఠాల్లో అసంతృప్తి నెలకొంటుందేమో అని బీజేపీ భావిస్తున్నది. ఫడ్నవీస్‌ను 'మరాఠా వ్యతిరేకి'గా పలుమార్లు మరాఠా నాయకుడు మనోజ్ జరాంగే అభివర్ణించడం, ఇప్పుడు గెలిచిన ఎమ్మెల్యేల్లో మెజారిటీ సభ్యులు మరాఠాలే కావడం కూడా ఇందుకు కారణాలని తెలుస్తున్నది. మరోవైపు సీఎం ఎంపికకు సంబంధించి చర్చించేందుకు షిండే, ఫడ్నవీస్, అజిత్ పవార్ కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో ఢిల్లీలో గురువారం రాత్రి సమావేశం అయ్యారు.

సగం మంత్రి పదవులు బీజేపీకే!

సీఎం పదవితో పాటు సగం మంత్రి పదవులను బీజేపీ తీసుకోనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మిగతా సగం పదవులను శివసేన, ఎన్సీపీకి కేటాయించనున్నది. షిండే నేతృత్వంలోని శివసేనకు 12 మంత్రి పదవులు దక్కనున్నట్లు తెలుస్తున్నది.

కాంగ్రెసే కొంప ముంచింది

శివసేన (యూబీటీ) అంతర్మథనం

మహా వికాస్ అఘాడీ ఓటమికి కాంగ్రెస్ పార్టీ అతి విశ్వాసం, వైఖరే కారణమని శివసేన(యూబీటీ) అంతర్మథనం చెందుతున్నది. పొత్తులో భాగంగా కాంగ్రెస్ 103 స్థానాల్లో పోటీ చేసి కేవలం 16 స్థానాల్లో గెలిచింది. శివసేన(యూబీటీ) 89 స్థానాల్లోనే పోటీ చేసినా 20 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్ తక్కువ స్థానాలను తీసుకొని ఉంటే ఫలితాలు అనుకూలంగా ఉండేవని శివసేన నేతలు అంటున్నారు. 'లోక్‌సభ ఫలితాల తర్వాత కాంగ్రెస్ అతివిశ్వాసంతో ఉంది. సీట్ల పంపకాల్లో ఆ పార్టీ వైఖరి మాకు నష్టం చేసింది. సీఎం అభ్యర్థిగా ఉద్ధవ్‌ను ప్రకటించి ఉంటే ఫలితాలు మరోలా ఉండేవి' అని శివసేన(యూబీటీ) నేత అంబదాస్ దన్వే పేర్కొన్నారు.

జార్ఖండ్ సీఎంగా హేమంత్ ప్రమాణం

రాంచీ: జార్ఖండ్ 14వ ముఖ్యమంత్రిగా జేఎంఎం నేత హేమంత్ సొరేన్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత గవర్నర్ సంతోష్ కుమార్ గంగ్వార్ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఇండియా కూటమి నేతలు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ హాజరయ్యారు. అంతకుముందు హేమంత్ ఎక్స్‌లో చేసిన పోస్ట్‌లో బీజేపీపై విరుచుకుపడ్డారు. ''మనల్ని ఎవరూ విభజించ లేరు, తప్పు దోవ పట్టించలేరు. మన గొంతు నొక్కాలని వారు (బీజేపీ) ఎంతో ప్రయత్నించారు. కానీ వారి ప్రయత్నానికి రెట్టింపుగా మన తిరుగుబాటు, స్వరం మరింత బలోపేతమైంది'' అని చెప్పారు.

ఆస్తిపై హక్కు మానవ హక్కే

స్పష్టం చేసిన జమ్ము కశ్మీర్ హైకోర్టు

శ్రీనగర్, నవంబర్ 28: ఆస్తిపై హక్కు ఇప్పుడు మానవ హక్కుల పరిధిలోకి వస్తుందని జమ్ము కశ్మీర్, లఢక్ హైకోర్టు స్పష్టం చేసింది. *1978* నుంచి ఆక్రమించుకుని ఉన్న భూమికి సంబంధించి పిటిషనర్‌కు *46* ఏండ్ల అద్దె బకాయిలను నెల రోజుల్లో చెల్లించాలని భారత ఆర్మీని ఆదేశిస్తూ జస్టిస్ వాసిమ్ సిద్ధిఖీ నార్గల్ తీర్పు చెప్పారు. 'ఆస్తిని కలిగి ఉండటం రాజ్యాంగ, చట్టబద్ధమైన హక్కే కాదు, ఇప్పుడది మానవ హక్కుల పరిధిలోకే వస్తుంది. నేడు మానవ హక్కులు బహుముఖ కోణాన్ని సంతరించుకున్నాయి' అని జడ్జీ పేర్కొన్నారు. కేసు వివరాల్లోకి వెళితే అబ్దుల్ మాజీద్ అనే వ్యక్తికి కుప్వారా జిల్లాలో ఉన్న *1.6* ఎకరాల భూమిని ఆర్మీ *1978*లో స్వాధీనం చేసుకుని తన అవసరాలకు వాడుకుంటున్నది. దీనికి అతనికి ఎలాంటి అద్దె కానీ, పరిహారం కానీ చెల్లించకపోవడంతో ఆయన *2014*లో న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. చట్టానికి లోబడి తప్ప ఒక వ్యక్తికి చెందిన ఆస్తులను ప్రభుత్వం కానీ, ప్రభుత్వ సంస్థలు కానీ స్వాధీనం చేసుకోలేవు అని న్యాయస్థానం ఈ కేసు సందర్భంగా స్పష్టం చేసింది.

ఇస్కాన్‌పై నిషేధానికి బంగ్లా హైకోర్టు నిరాకరణ

ఢాకా, నవంబర్ 28: ఇస్కాన్ సంస్థ కార్యకలాపాలను నిషేధించేందుకు బంగ్లాదేశ్ హైకోర్టు నిరాకరించింది. ఇస్కాన్ మాజీ సభ్యులు చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టు నేపథ్యంలో ఇస్కాన్‌పై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను గురువారం విచారించిన హైకోర్టు.. ఇస్కాన్‌పై నిషేధం విధించేందుకు నిరాకరించింది. కాగా, చిన్మయ్ కృష్ణదాస్ అరెస్టును బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఖండించారు. ఆయనను అన్యాయంగా అరెస్టు చేశారని, వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

ఐసీసీలో హసీనాపై విచారణ జరపాలి

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి షేక్ హసీనాపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు(ఐసీసీ)లో విచారణ జరపాలని తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ కోరారు. గురువారం ఆయనతో ఢాకాలో ఐసీసీ ప్రాసిక్యూటర్ కరీం ఏ ఖాన్ భేటీ అయ్యారు. హసీనాపై బంగ్లాదేశ్‌లో జరుగుతున్న విచారణతో పాటు ఐసీసీలోనూ విచారణ జరపాలని ఆయనను యూనస్ కోరారు.

రష్యా క్షిపణి దాడుల్లో ధ్వంసమైన కీవ్‌లోని విద్యుత్ కేంద్రం

ఉక్రెయిన్‌పై విరుచుకుపడిన రష్యా

- దాదాపు 200 క్షిపణులు, డ్రోన్లతో భీకర దాడి
- 10 లక్షల ఇండ్లకు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కీవ్: ఉక్రెయిన్ విద్యుత్తు ఉత్పత్తి, సరఫరా వ్యవస్థపై రష్యా గురువారం విరుచుకుపడింది. దాదాపు 200 క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. రెండు వారాల్లో ఇది రెండో భారీ దాడి. చలికాలం రావడానికి ముందే తమ విద్యుదుత్పత్తి వ్యవస్థను దెబ్బ తీయడానికి రష్యా ప్రయత్నిస్తున్నదనే ఆందోళన ఉక్రెయిన్‌లో వ్యక్తమవుతున్నది. ఉక్రెయిన్‌లోని అన్ని ప్రాంతాల్లోని విద్యుత్తు ఉత్పత్తి ప్రాజెక్టులపై రష్యా దాడులు చేస్తున్నదని ఉక్రెయిన్ విద్యుత్తు శాఖ మంత్రి హెర్మన్ హలూషెంకో ఫేస్‌బుక్ పోస్ట్‌లో తెలిపారు. దేశవ్యాప్తంగా అత్యవసర విద్యుత్తు కోతలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. సామాన్య ప్రజలు నివసించే ప్రాంతాలపైనా రష్యా దాడులు చేస్తున్నదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. ఒకేసారి పెద్ద మొత్తంలో చిన్న చిన్న బాంబులను కురిపిస్తుండటంతో సాధారణ పౌరులు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రజలు తమ ఫోన్లు, ఇతర పరికరాలను ఛార్జింగ్ చేసుకోవడానికి ఏర్పాట్లు చేయాలని స్థానిక అధికారులను ఉక్రెయిన్ ఆదేశించింది. ప్రజల కోసం ప్రత్యేకంగా షెల్టర్లను ఏర్పాటు చేయాలని చెప్పింది.

ముడా కేసులో దర్యాప్తు ముమ్మరం

మాజీ కమిషనర్‌ను ప్రశ్నించిన లోకాయుక్త

మైసూరు: కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆరోపణలు ఎదుర్కొంటున్న ముడా కేసులో లోకాయుక్త పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. గురువారం మైసూర్ అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ(ముడా) మాజీ కమిషనర్ పీఎస్ కాంతరాజును లోకాయుక్త పోలీసులు విచారించారు. సిద్ధరామయ్య భార్య పార్వతికి ప్లాట్లు కేటాయించిన సమయంలో కాంతరాజు ముడా కమిషనర్‌గా పని చేశారు. స్థల కేటాయింపు నిర్ణయం ముడా బోర్డు సమావేశంలో సమష్టిగా తీసుకున్నదని, ఇదే విషయాన్ని విచారణ అధికారికి తెలియజేసినట్టు కాంతరాజు తెలిపారు. ఈ కేసులో ఈడీ సైతం విచారణ జరుపుతున్నది.

కేపీసీసీ అధ్యక్షుడిని మార్చొచ్చు

కర్ణాటక మంత్రి పరమేశ్వర

బెంగళూరు: కర్ణాటక పీసీసీ అధ్యక్షుడిని మారుస్తారనే వార్త వినిపిస్తున్నదని హోంమంత్రి పరమేశ్వర పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ ఢిల్లీకి వెళ్లారని, అక్కడ సీడబ్ల్యూసీ సమావేశం తర్వాత రాష్ట్ర పార్టీ వ్యవహారాలపై చర్చలు జరగొచ్చని ఆయన పేర్కొన్నారు. క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణతో పాటు పీసీసీ అధ్యక్షుడిని మారుస్తారనే ప్రచారం వినిపిస్తున్నదని ఆయన తెలిపారు. కాగా, నాలుగేండ్లుగా పీసీసీ అధ్యక్షుడిగా డీకే కొనసాగుతున్నారు.

ఈడీ అధికారులపై దాడి

న్యూఢ